# 'లక్షవ ఎపిసోడ్ కథ'

డాక్టర్. ఎమ్. సుగుణరావు

''సార్ నాకు ప్రమోషన్ వచ్చింది'' అన్నాడు వామనరావు బాస్‌తో.

''కంగ్రాచ్చులేషన్స్, తండ్రిని కాబోతున్నవన్నమాట'' అన్నాడు బాస్.

'' ఆ ప్రమోషన్ కాదు సార్'' అన్నాడు వామనరావు సిగ్గుపడుతూ.

''మరయితే నాకు తెలీకుండా నీకు ఉద్యోగంలో ప్రమోషన్ రావడం ఏమిటి?'' అన్నాడు బాస్ అనుమానంగా.



''సార్ నేను రచయితనని మీకు తెలుసు. ఉత్తరాల రచయితగా సాహితీ జీవితాన్ని ప్రారంభించినా ఉత్తరోత్రా ఉత్త రచయితగా మిగలకుండా, ఉత్తమ కథా, నవలా రచయితగా ఎదిగిన నాకు, టీవీ సీరియల్ రాయడానికి పిలుపు వచ్చింది. నేను రాసిన 'జీవితం' అనే సీరియల్‌నే టీవీ సీరియల్‌గా తియ్యడానికి పిలిచారు'' అన్నాడు వామనరావు.

''వెరీగుడ్. మీకు వెంటనే సన్మానం చెయ్యాలి'' అని బాస్ వామనరావు భుజం చరిచాడు.

బాస్ ఆ మాట అంటాడో లేదో అని ఎదురుచూసిన వామనరావు ''అబ్బే ఎందుకు సార్ ఇవన్నీ'' అన్నాడు మాటవరసకి.

''అంటే.. మీకిష్టం లేదా ఇవన్నీ..!'' అన్నాడు బాస్.

''మీ ఇష్టమే నా యిష్టం'' అన్నాడు వామనరావు కంగారుగా. బాస్ తనకు సన్మానం చెయ్యకుండా ఆపేస్తాడని భయపడి.

* * *

ఒక సాయంకాలం వామనరావుకు ఆఫీసులోనే సన్మానం ఏర్పాటు చేసారు. అతడి బాస్ వామనరావుకి శాలువా కప్పారు. ఇంకో ఉద్యోగి మెడలో పూలదండ వేశారు. ఆ తర్వాత ''సన్మాన గ్రహీత మాట్లాడాలి!'' అన్నారంతా.

వామనరావు లేచి నిలబడి, ''మిత్రులారా! నాకు సన్మానం చేసినందుకు కృతజ్ఞతలు. నేను టీవీ సీరియల్ రాస్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మానం కనుక టీవీ గురించిన ఉపయోగాలు మీకు వివరిస్తాను'' అంటూ చెప్పడం ప్రారంభించాడు.

''మా వీధిలో ఒక ఎనభయ్యేళ్ళ ముసలావిడ వుంది. ఒక రోజు హఠాత్తుగా కళ్ళు తేలేసింది. వెంటనే మంచం మీదనించి దించేసారు. చుట్టాలంతా వచ్చేసారు. తులసి తీర్థం నోట్లో పోద్దామని పెద్దకొడుకు తమలపాకుతో తయారుగా వున్నాడు. డాక్టరొచ్చి పరీక్ష చేసి, కోమాలోకి వెళ్ళిందే తప్ప చనిపోలేదు అని నిర్థారించారు.

రాత్రి ఏడున్నరకు ఆవిడ కళ్ళు తెరిచింది. వేలుతో డ్రాయింగ్‌రూమ్ వైపు చూపించింది. పాపం ఆఖరి సారిగా భర్తగారిని చూద్దామని కాబోలు డ్రాయింగ్ రూము వైపు తీసుకెళ్ళమంది అనుకున్నారు. ఆ గది లోకి తీసుకెళ్ళారు. ఆవిడ భర్తగారి నిలువెత్తు ఫొటో చూళ్ళేదు, టీవీ వంక చూపించింది. ముసలావిడకు

**టివి సీరియల్స్ తీసేవారి, రాసేవారి, చూసేవారిబాధలకి కథన రూపమే ఈ రెండు కథలు. ఇద్దరి రచయితల మెరుపుదాడి సీరియల్స్ పైనే అయినా, ఇతివృత్తాలు వేరువేరు. మన సీరియల్స్ నాసిరకంగా ఎందుకుంటాయో ఒకరు తెలియజేస్తే, ఇళ్ళలో అవి సృష్టించే కంగాళీని ఇంకో రచయిత చిత్రించారు. సరదాగా చదవండి**

టీవీ అంటే ప్రాణం కాబోలు, అనుకుంటూ టీవీ ఆన్ చేశారు. అన్ని టీవీ సీరియళ్ళు చూసి రాత్రి పదిగంటలకు మళ్ళీ మగతలోకి జారుకుంది. మంచం మీద నుంచి దించేసారు. డాక్టరొచ్చి కోమా అన్నాడు. చుట్టాలకేం చెయ్యాలో పాలుపోలేదు. శలవులు పెట్టుకుని వచ్చారు. ఆవిడ ఊపిరి వదిలితే ఊపిరి పీల్చుకుందామనే వారి ఆశ తీరలేదు. తర్వాత రోజు యథాతథంగా అదే కథ జరిగింది. రాత్రి సీరియల్ మొదలయ్యే టైముకు లేచి కూర్చుంది. ''ఇప్పట్లో ఆవిడకు మరణ ఘడియలు లేవు, ఆ సీరియళ్ళు ఆగిపోతేనే తప్ప. ఈ సంఘటన బట్టి ఏం అర్థమవుతోంది?'' అన్నాడు వామన రావు తను చెప్పిన ఉదంతం చెప్పడం ముగించి. అందరూ మౌనంగా ఉండిపోయారు తప్ప అతడి ప్రశ్నకు జవాబు ఇవ్వలేదు.

''అయితే నేను చెబుతాను వినండి. వృద్ధుల ఆయుష్షు పెంచే మృత సంజీవని టీవి'' అన్నాడు వామనరావు ముక్తాయింపుగా.

వెంటనే ఒక సహచరుడు లేచి, ''టీవీ సీరియళ్ళ వలన కొంతమందికి మరీ మతి చలిస్తోంది. మా వీధిలో ఒకావిడ సీరియల్‌లో హీరోయిన్‌కు కష్టాలు తగ్గితే తిరుపతికి వెళ్ళి తలనీలాలు ఇస్తానని మొక్కుకుంది. దీని మాటేమిటి?'' అన్నాడు.

వామనరావు సమాధానం చెప్పడానికి గొంతు సవరించుకోగానే ఇంకొకాయన లేచి, ''మా ఇంట్లోనే జరిగిన ఒక ఉదంతం చెబుతాను'' అంటూ చెప్పడం మొదలుపెట్టాడు.

''నేనూ, మా ఆవిడ పిల్లలు, మేమంతా టీవీ సీరియళ్ళకు బానిసలం అయిపోయాం. ఈ మధ్య మా పనిమనిషి భారంగా కనిపిస్తోంది. బహుశా ఆవిడ నిండు చూలాలనుకుని డెలివరీ అయ్యేవరకూ వేరొక పనమ్మాయిని కుదర్చమని చెప్పాం. అయినా ఆమె పని మానకుండా వస్తోంది. అయితే వారానికి సరిపడా తెచ్చుకుని ఫ్రిజ్‌లో దాచుకునే కూరగాయలు మాయం అవుతున్నాయి. నెలకు సరిపడా తెచ్చుకునే బియ్యం, పప్పులు నెల తిరక్కుండానే అయిపోతున్నాయి. ఆశ్చర్యంగా మా పనిమనిషి పనిచేసే మిగతా ఇళ్ళల్లోనూ అదే పరిస్థితి. ఈ నేపథ్యంలో మా పనిమనిషి మొగుడు మా వీధిలోనే ఒక కిరాణా షాపు పెట్టాడు. అయితే ఒకరోజు కరంటు ఆగి టీవీ సీరియల్ రాకపోవడంతో వంట గదిలోకి వెళ్ళిన మా శ్రీమతికి పనమ్మాయి దొరికిపోయింది. తాత్కాలిక గర్భిణీ వేషం బయటపడింది. టీవీ సీరియల్ చూస్తూ మత్తులో వున్న మమ్మల్నే కాదు, ఆ వీధిలో అందర్నీ మాయంచేసి సామాన్లు, బియ్యం పట్టుకుపోయి తన భర్తతో షాపు పెట్టించింది. దీన్నిబట్టి ఏం అర్థమవుతోంది. టీవీ ఒక మత్తు, దాన్ని చెయ్యాలి చిత్తు'' అన్నాడు కవితా ధోరణిలో తన ఉపన్యాసం ముగించి.

చర్చ మరీ గాడి తప్పుతోందని బాస్ గ్రహించి ''ఈ చర్చను ఇంతటితో ముగిస్తున్నాను జైహింద్'' అన్నాడు పత్రికా సంపాదకుడి ధోరణిలో.

తన సన్మానంలో అందరూ ఇలా టీవీ వ్యతిరేక ప్రకటనలు చెయ్యడంతో షాక్‌తిన్న వామనరావు, 'బ్రతుకు జీవుడా' అనుకుంటూ అందరికీ నమస్కారం పెట్టి గబగబా ఆఫీసులోంచి బైటపడ్డాడు.

* * *

తర్వాతి రోజు టీవీ సీరియల్‌కు స్క్రిప్టు రాయడానికి హైదరాబాద్ చేరుకున్నాడు వామనరావు. ప్రొడ్యూసర్ గారి ఆఫీసులోనే రూమ్ ఇచ్చారు. ఆరోజు రాత్రి ప్రొడ్యూసరూ, డైరెక్టరూ వచ్చారు కథా చర్చల కోసం.

''ఔను హాలీవుడ్ సినిమాల్లో ఎక్కువ సీనులు తిండి తింటున్నవి కనిపిస్తాయి. బర్గర్లు తింటూ కోక్ తాగుతున్న నటులు కనిపిస్తారు. మన ప్రాంతానికి అనుగుణంగా మనవాళ్ళు ఉలవచారులో ఇడ్లీ నంజుకున్నట్లు, పెరుగు వడలు తింటూ మిరపకాయ బజ్జీ కొరికినట్టు, ఇలా చూపిస్తూ, చాలా సీన్లు లాగిం చెయ్యవచ్చును. ఇలా కథలో ఎన్నో మలుపులు''

''సార్! మనం కథ మీద కూర్చుందామా'' అన్నాడు వామనరావు.

''ఏమయ్యా! అదేమన్నా కుర్చీనా బెంచీనా కూర్చోవడానికి'' అంటూ ప్రొడ్యూసర్ పెద్దగా పగలబడి నవ్వాడు. డైరెక్టరు అతడికి కోరస్‌గా నవ్వాడు. వామనరావూ నవ్వక తప్పలేదు.

''ఇంతకీ మన సీరియల్ ఎన్ని ఎపిసోడ్లకు రాస్తున్నావ్?'' అన్నాడు ప్రొడ్యూసరు.

''నేను రాసిన నవల రెండొందల యాభై పేజీలు. పాతిక వారాలు సీరియల్‌గా వచ్చింది. మన టీవీకి అనుగుణంగా రాస్తే ముప్ఫయి ఎపిసోడ్లు వస్తుంది'' అన్నాడు వామనరావు.

''ముప్ఫయ్యా! కనీసం మూడొందల ఎపిసోడ్లు వుంటేనే గానీ గిట్టుబాటు కాదు'' అన్నాడు ప్రొడ్యూసరు.

''మూడొందల ఎపిసోడ్ల సీరియలూ, అలా సాగదీయడానికి కథ లేదే'' అన్నాడు వామనరావు.

''కథ కావాల్సి వస్తే ఇదిగో'' అంటూ డైరెక్టరు తన బేగ్‌లోంచి ఒక సిడి బైటకు తీసాడు.

''ఏంటిది?'' అన్నాడు వామనరావు ఆశ్చర్యంగా.

''ఇది ఒక పాత హాలీవుడ్ సినిమా. దీన్ని చూసి అవసరమైన చోట మార్పులు చేసి, మన నేటివిటీకి దగ్గరగా మార్చండి. మధ్యలో మీ సీరియల్‌లోని సీన్లు ఉపయోగించండి'' అన్నాడు డైరెక్టరు.

''నా సీరియల్ పూర్తిగా పదహారణాలు, ఇంకా గట్టిగా చెప్పాలంటే నూరు పైసల తెలుగు కథ. దీనికి హాలీవుడ్ రంగులు పూయాలా?'' అన్నాడు వామనరావు.

''ముందే అనుమాన పడితే ఎలా? ముందా సిడి చూడు'' అన్నాడు ప్రొడ్యూసరు.

డైరెక్టర్ సిడి పెట్టి టీవీ ఆన్ చేశాడు.

హాలీవుడ్ సినిమా మొదలయ్యింది. మొదటి సీనులో హీరో కేక్ తయారు చేసిన తన కుటుంబ సభ్యులకు తినిపిస్తున్నాడు.

''చూసావా, ఆ సీను మన నేటివిటీకి అనుగుణంగా మార్చు. మన హీరో ఏదో పచ్చడి చేసి అతడి తల్లిదండ్రులకు వడ్డిస్తున్నట్టు చూపిస్తే మనం కూడా సెంటిమెంట్ టచ్ చేసినట్టనిపిస్తుంది'' అన్నాడు ప్రొడ్యూసరు.

''ఔను హాలీవుడ్ సినిమాల్లో ఎక్కువ సీనులు తిండి తింటున్నవి కనిపిస్తాయి. బర్గర్లు తింటూ కోక్ తాగుతున్న నటులు కనిపిస్తారు. మన ప్రాంతానికి అనుగుణంగా మనవాళ్ళు ఉలవచారులో ఇడ్లీ నంజుకున్నట్లు, పెరుగు వడలు తింటూ మిరపకాయ బజ్జీ కొరికినట్టు, ఇలా చూపిస్తూ, చాలా సీన్లు లాగించెయ్యవచ్చును. ఇలా కథలో ఎన్నో మలుపులు'' అన్నాడు డైరెక్టరు.

''అయితే మన సీరియల్‌ని మా నరసాపురంలోని ఏడు మెరికల సందులో తీద్దాం'' అన్నాడు ప్రొడ్యూసరు.

''దేనికీ!'' అన్నాడు వామనరావు ఆశ్చర్యంగా.

''అదే డైరెక్టరుగారు కథలో మలుపులు వున్నాయన్నారు కదా, మా ఊళ్ళోని ఏడు మెరికల సందులో కూడా ఏడు మలుపులుంటాయి అన్నాడు''

ప్రొడ్యూసర్ వివరంగా.

ఆ మాటలకు వామనరావు తల దిమ్ముగా అయిపోయింది. క్షణం సేపు మౌనంగా ఉండిపోయాడు.

"ఏమయ్యా! అలా బెల్లం కొట్టిన రాయిలా వుండిపోయావేం, డైరెక్టరుగారు కథలో మంచి మలుపు తిప్పితే, ఆయన చెప్పింది రాసుకో. మంచి సీను" అన్నాడు ప్రొడ్యూసరు.

వామనరావుకు నవ్వాలో, ఏడవాలో అర్థం కాని పరిస్థితి.

"రోట్లో తలకాయ పెట్టిన తర్వాత రోకటి పోట్లకు భయపడనేల?" అనుకున్నాడు. వాళ్ళు వెళ్ళిన తర్వాత డైనింగ్ హాల్ సీన్లతో పది భాగాల సీరియల్‌కు సరిపడా స్క్రిప్టు రాసి వారికి అందజేశాడు.

* * *

తరువాతి రోజే షూటింగ్ మొదలయ్యింది. మొత్తం షూటింగ్ డైనింగ్ హాల్లో, వంటగదిలో సాగడంతో పది ఎపిసోడ్ల సీరియల్ గబగబా తయారయిపోయింది.

రెండురోజుల తర్వాత ప్రొడ్యూసర్ హడావుడిగా వామనరావు రూముకొచ్చాడు.

"బాబూ నా ప్రాణం మీద కొచ్చింది. పది భాగాలు తీసింతర్వాత హీరో డబ్బులు ఎక్కువ ఇమ్మని గొడవ పెడుతున్నాడు. అంచేత హీరోని మార్చేద్దాం" అన్నాడు.

"హీరోని మార్చడమా?" అన్నాడు ఆశ్చర్యంగా వామనరావు.

"ఏముంది, హీరోకి ప్రమాదం జరిగి, ముఖం పచ్చడయిపోయి గుర్తుపట్టలేని విధంగా అయిపోయి ప్లాస్టిక్ సర్జరీ చేసుకున్నట్టు చూపిద్దాం. అలా వేరొక హీరోని బుక్ చేసుకుందాం" అన్నాడు ప్రొడ్యూసర్.

"అదేంటండీ, మొదట్లో హీరో పచ్చడి చేసినట్టు చూపించి, ఇప్పుడు తనే పచ్చడయిపోయినట్టు మార్చాలా. అహ్హహ్హ.. భలే సింబాలిక్‌గా వుంది" అంటూ వామనరావు నవ్వాడు.

"ఏం నీకు వేళాకోళంగా వుందా. తిక్కగా మాట్లాడితే నిన్నూ మార్చేస్తాను" అన్నాడు ప్రొడ్యూసరు కోపంగా. వెంటనే వామనరావు బతిమాలుతూ "బాబ్బాబు ఆ పని మాత్రం చేయకండి. శలవు పెట్టి మరీ వచ్చి టీవీ సీరియల్ రాస్తున్నాను. మీరెలా చెపితే అలానే" అంటూ పదకొండో ఎపిసోడ్‌లో హీరోకి ప్రమాదం జరిగినట్టు స్క్రిప్టు మార్చాడు.

* * *

వారం రోజుల తర్వాత మళ్ళీ ప్రొడ్యూసర్ పరిగెత్తుకుంటూ వామనరావు దగ్గరకొచ్చాడు. అతడి ముఖం ఉబ్బి వుంది. బుగ్గమీద ప్లస్ గుర్తు బేండేజి.


"అయ్యా ఈసారి ఎవరిముఖం పచ్చడి చెయ్యాలి?" అన్నాడు వామనరావు ప్రొడ్యూసర్ ముఖంలోకి పరీక్షగా చూస్తూ.

"ఏం చేస్తాను, అంతా నాఖర్మ. మన సీరియల్‌లోని విలన్ పాత్రధారితో గొడవ వచ్చింది. మాటలు పెరిగి కొట్టుకునే వరకూ వెళ్ళాము. అందుకు ఫలితం ఈ నా వాలకం చూసారుగా" అన్నాడు ప్రొడ్యూసర్ నీరసంగా.

"ఓహో ఈసారి మీ ముఖం పచ్చడయిందన్నమాట" అని మనసులో అనుకుంటూ "అయితే ఏం చెయ్యమంటారు?" అన్నాడు వామనరావు.

"ఏముందీ మొన్న ఎపిసోడ్‌లో హీరోకి ప్రమాదం జరిగినట్టు చూపించాం, అలాగే విలన్‌కూ చూపించి అతడి ముఖం పచ్చడయిపోతే"

ప్రొడ్యూసర్ మాటలు ఇంకా పూర్తి కాకపునుపే



వామనరావు " అంటే ఆ విలన్‌కు ప్లాస్టిక్ సర్జరీ చేసి ఇంకో కొత్త విలన్‌ను పెట్టాలా? ఎందుకు ఇవన్నీ, నాకే యాక్సిడెంట్ చేయించి నా స్థానంలో ఇంకో రైటర్‌ని పెట్టుకోండి" అన్నాడు వామనరావు కోపంగా.

"ఏంటయ్యా, పది ఎపిసోడ్లకే అంతవిసుక్కుంటున్నావ్, ఇంకా వెయ్యి ఎపిసోడ్లు మన సీరియల్ లాగిద్దామనుకుంటుంటే" అన్నాడు ప్రొడ్యూసర్ కోపంగా.

ఆ మాటలకు వామనరావు కోప తారాస్థాయినందుకుంది.

"ఏంటీ వెయ్యి భాగాల సీరియల్లా, బంగారం లాంటినా నవల 'జీవితం' దాన్ని జీళ్ళ పాకంలా సాగదీయమంటున్నావ్. మన సీరియల్ చూస్తున్న వాళ్ళు జీవితం బదులు జీళ్ళపాకం అని పేరుమార్చమని జోకులేస్తున్నారు" అన్నాడు కోపంతో ఊగిపోతూ.

ఇంతై.. ఇంతింతై వటుడింతై అన్నట్టుగా వామనరావు తన విశ్వరూపాన్ని చూపించేసరికి ప్రొడ్యూసర్‌కు చమటలు పట్టాయి. ఆ విలన్ చేతిలో దెబ్బలు తిన్నా, మళ్ళీ రైటర్‌తోనూ అదే పరిస్థితి వచ్చేటట్టుంది" అనుకుంటూ అక్కణ్ణించి వేగంగా కదిలాడు ప్రొడ్యూసర్.

ప్రొడ్యూసర్ వెళ్ళిన పావుగంట వరకూ వామనరావు మామూలు మనిషి కాలేకపోయాడు. బాగా ఆలోచించి ఆరోజే మకాం ఎత్తేసి తన ఊరికి ప్రయాణమయ్యాడు.

* * *

"భక్తా వామనా. నీ నీతి ప్రవర్తన నాకు నచ్చింది. నీలాంటి నీతిమంతుడికి వేరే జన్మలేకుండా మోక్షం ప్రసాదిస్తున్నాను.

ఎదురుగా తెల్లటి కాంతి పుంజం, మధ్యగా మెరిసిపోతూ దేవుడు ప్రత్యక్షమై చెబుతున్న ఆ మాటలకు వామనరావు ఆశ్చర్యంగా చూస్తూ "స్వామీ నేను నీతిమంతుడినా నాకేం ఆశ్చర్యంగా వుంది" అన్నాడు.

"నువ్ ఆఫీసు ఎగ్గొట్టి టీవీ సీరియళ్ళతో పొద్దుపుచ్చుతున్నావ్, నీ సీటులోని అవినీతి పనులు వేరే ఉద్యోగి చేస్తున్నాడు, అలా నీకు అవినీతి అంటలేదు. అందుకే నీకు వేరే జన్మలేకుండా ముక్తి ప్రసాదిస్తున్నాను" అన్నాడు దేవుడు వామనరావుని ఆశీర్వదిస్తూ.

దేవుడి మాటలకు వామనరావు వెంటనే "స్వామీ కొంప దీసి ఆ పని మాత్రం చెయ్యకండి. నాకు మోక్షం వద్దు, ఈ జన్మ తర్వాత ఇంకోజన్మ అలా యాభై జన్మలు ఎత్తాలి నేను" అన్నాడు వామనరావు.

"పిచ్చివాడా! అందరూ జన్మలేకుండా లక్షవ ఎపిసోడ్ మూడొందల సంవత్సరాల తర్వాత వస్తుంది. అంచేత నాకు మోక్షం వద్దు. జన్మ తర్వాత జన్మ ఆతర్వాత ఇంకో జన్మ... అలా జన్మ మీద జన్మ.. జన్మమీద జన్మ.. జన్మమీద జన్మ..."

"ఏంటండీ కలవరిస్తున్నారు?" అంటూ వామనరావుని కుదుపుతూ అతడి చర్య.

వామనరావు కళ్ళు తెరిచాడు. "మైగాడ్ ఇదంతా కలా!" అన్నాడు భార్యవంక చూస్తూ.

"ఏం కల కన్నారు" అంది వామనరావుభార్య.

"సీ! రియల్ కథ" అన్నాడు వామనరావు.

"అంటే!" అంది భార్య అర్థం కాక.

"జీవితం జీళ్ళపాకం" అన్నాడు వామనరావు.

అంటే! మళ్ళీ ప్రశ్నించింది భార్య.

"లక్షవ ఎపిసోడ్ కథ" అంటూ తనకొచ్చిన కల గురించి నవ్వుతూ చెప్పాడు వామనరావు. అతడి నవ్వుతో ఆమె శృతి కలిపింది.

★